అమృత్ కిరణ్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# అమృత హృదయాలు

-జి.పి. రామ్‌చంద్



ఈ రోజుతో ఇన్‌స్పెక్షన్ అయిపోయింది. కానీ ఎంత బాగా చేసి పనిలో ఏవో ఒక వంకలు పెట్టిన చెకింగ్ ఆఫీసరుపై చెప్పలేనంత కో వచ్చింది.

కానీ ఏమి చేయలేని నిస్సహాయత నాలో నేను ఉడికిపోవటం తప్ప చేయలేకపోయాను. నా కోపాన్ని ఎవరి మీద చూపించాలో అర్థం కాలేదు.

ఇంటికి రాగానే సాయంత్రం చిరునవ్వుతో ఎదురు వచ్చే శ్రీమతిపై చిందులు వేద్దామంటే పుట్టింటికి వెళ్ళింది.

హోంవర్క్ చేయని సుపుత్రుడి వీపు చితక్కొడదామంటే వాడూ తల్లి వెంటే వెళ్ళాడు.

మొహం కడుక్కొని ఇంటినుంచి బైట పడ్డాను. కాస్త దూరం వెళ్ళాక ఇంటికి గొళ్ళెం పెట్టి తాళం వేయటం మరిచానని గుర్తుకొచ్చి గుండె గుభేల్మంది.

తిరిగి వెళ్ళి తాళం వేసి 'కీ' జేబులో వేస్కొని తిరిగి నడక సాగించాను.

మొదట వచ్చిన దారిలో కాక మరో దారిలోకి నడిచాను. ఇపుడు మనస్సు దేనిపై నన్నా డైవర్ట్ చేయగల్గితేనే కాని మనశ్శాంతి లభించేలా లేదు.

సందు మలుపు తిరిగి మెయిన్‌రోడ్‌లో కొచ్చాను. ఎదురుగా ఉన్న గోడకు వివిధ సినిమా పోస్టర్లు దర్శన మిచ్చాయి.

కాస్త ఆగి చూశాను. అందులోంచి 'ఎ' సర్టిఫికెట్ సినిమా పోస్టర్ ఆకర్షణీయంగా ఉండి, రమ్మని పిలుస్తోంది.

ఏ టాకీసులో ఆడుతుందో చూశాను. ఇక్కడికి దగ్గరే... అటువైపు నడిచాను.

మామూలుగా పెద్దలకు మాత్రమే సినిమా. అయినా పిన్నలు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు.

బుకింగులన్నీ రష్‌గా ఉన్నాయి. ఒకడు టిక్కెట్స్ బ్లాక్‌లో అమ్ముతుంటే అర్రూపాయల టిక్కెట్‌ను ఇరవై రూపాయలకు సంపాదించినందుకు సంతోషించాను.

సీట్లోకూర్చున్న ఐదు నిమిషాలకు పిక్చర్ స్టార్ట్ అయింది. డబ్బింగ్ తమిళ సినిమా అది. ప్రేక్షకుల వేడి నిట్టూర్పులకు స్క్రీన్ కాలిపోతుందా అన్పించింది. ఏమైతేనేం సినిమా అయిపోయింది.

అందరూ బైటకి వెళుతున్నారు. ఇంటికి వెళ్ళి చేసే పనేమీలేకపోవటంతో ఆ తొక్కిసలాటలో వెళ్ళేకంటే కాస్త నిదానంగా వెళదామని వెనుకనే ఆగి అందరూ వెళ్ళాక బయటపడ్డాను.

ఒంటరిగా నడుస్తూ చూసిన సిన్మాలోని దృశ్యాలను గుర్తుకుతెచ్చుకుంటూ నడుస్తున్నాను.

తార్రోడ్డునలుపునకు చీకటి తోడై ఆ పరిసరాలన్నీ చీకటిమయంగా ఉన్నాయి.

అలాగే నడుస్తున్న నాకు చీకట్లో ఎవరో కదలినట్లయి అటు చూశాను.

ఎవరో స్త్రీ ఆ చీకట్లో నిలబడి ఉంది.

నేను చూడగానే దగ్గరికి వచ్చింది. ఆ చీకటిలో మొహం అంత స్పష్టంగా కన్పించటం లేదు.

"వస్తారా! యాభై రూపాయలే" అంది. అంత హఠాత్తుగా ఆమె అలా అడిగేసరికి ఆశ్చర్యంతో ఆగిపోయాను.

కథల్లోనూ, మిత్రులు చెప్పగా వినటం మాత్రమే తెలిసిన నాకు ఇంతదాకా అలాంటివన్నీ అబద్ధాలని అనుకొనేవాణ్ణి. నా దగ్గర తమ గొప్పలు చెప్పుకోవటం కోసం కోసే కోతలుగానే భావించాను.

అందులోనూ భారతస్త్రీపై ఉండే ఓ విధమైన పవిత్ర భావం కూడా నాకు వారి మాటలు అబద్ధాలుగా తోయడంతో కొట్టిపారేసేవాణ్ణి.

అలాంటిది ఇపుడు ఆమె అంత ధైర్యంగా అలా అడిగేసరికి చేష్టలుడక్కి నిలబడి పోయాను.

"యాభై అంటే ఎక్కువ" అని నేనాలోచిస్తున్నానను కుందేమో- "పోనీ పాతికివ్వండి చాలు" అంది దీనంగా.

మనస్సు చివుక్కుమంది. "పద" అన్నాను.

అది రేటు తగ్గినందుకో లేక సినిమా ప్రభావమో ఆలోచించలేదు.

ఇద్దరం ఓ పూరిగుడిసెలోకి ప్రవేశించాం. అందులో ఓ గుడ్డిదీపం వెలుగుతోంది. చమురు అయిపోవచ్చిందేమో సన్నగా వెలుగుతోంది.

ఒకసారి చుట్టూ పరికించాను. ఓ కుక్కిమంచం కొక్కెల గుర్రాలను తీర్చే పాన్పులా ఉంది.

గుడిసెమధ్య తడిక... బైట్నుంచి చూస్తే కన్పించేంత పెద్దగా లేదనిపించింది. కానీ కాస్త జాగ్రత్తగా చూస్తే దానికి ఓ తలుపు ఉన్నట్లుగా అర్థమైంది.

చటుక్కున మంచంపై కూర్చొని నాచేయిపట్టి లాగి తన ప్రక్కన కూర్చో పెట్టుకుంది. అపుడు గమనించాను ఆమెను. చామన ఛాయలో ఉంది. కళగల మొహమే అయినా వాడిన పుష్పంలా ఉంది.

తీర్చిదిద్దిన కన్నులు అమాయక లేడికన్నుల్లా ఉన్నాయి. అందమైన నాసిక క్రిందగల అధరాలు ఎండిపోయి ఉన్నాయి. ఒత్తైన వెంట్రుకలకు తైల సంస్కారం లేక ఎర్రగా ఉన్నాయి.

చూసిన సినిమా దృశ్యాలు, ఆమె సాంగత్యం ఆఫీసర్ తిట్లను మరిపించాయి. ఆమెని దగ్గరికి తీస్కోబోతుండగా...

"కార్... కార్..." మన్న పసిపిల్లవాడి ఏడుపుతో అదిరిపడి ఎముకల గూడులాంటి ఆమె శరీరాన్ని వదిలేశాను.

రసభంగం కలిగినందుకు నొచ్చుకుంటున్నట్టుగా ఆమె లేచి ఒక్క నిమిషం అని తడిక తలుపును జరిపి లోపలికి వెళ్ళింది.

కాసేపటికి పిల్లవాడి ఏడుపు ఆగిపోయింది. మరి కాసేపటికి తిరిగి వచ్చింది.

అప్పటికే ఆలస్యం చేశానన్న భావంతో ఆమె ఛటుక్కున నా ప్రక్కన వచ్చి కూర్చుంది.

అప్పటికే మత్తుదిగినట్లయింది. ఆమె చనువుగా తన చిరుగుల పైటను తప్పించి...

అప్పటిదాకా పిల్లవాడి నోటికందించి వచ్చిన వక్షాల నుంచి కారిన పాలతాలూకు తడి వేడిగా తగిలేసరికి చటుక్కున ఆమెను పక్కకు తోసి నిలుచున్నాను.

పసివారి ఆకలితీర్చే అమృతహృదయాలు కామపు కళ్ళ యాసిడ్ చూపుల్లో రగిలిపోతున్న నిజం నన్ను బాధించింది!

జేబులోంచి మనీపర్స్ తీసి ఆమె కాళ్ళ దగ్గర ఉంచాను. నేను చేసిన పనికి అది ప్రాయశ్చిత్తం కాదని తెలుసు...

ఆమెకి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా వడి వడిగా అడుగులు వేశాను.

జి.పి. రామ్‌చంద్
63/4, చితంబర రావు వీధి,
కర్నూలు.

★

# పరిచయం



పేరు : జి.పి.రామ్‌చంద్
వయస్సు : 23 సం॥లు
గ్రామం : కర్నూలు.
రచనలు : కార్టూన్లు, కవితలూ..
బహుమతి : ఆంధ్రజ్యోతి కథల పోటీలో కైనెటిక్ వారి బహుమతిని అందుకోవటం ప్రథమం.

నా కథను సెలక్ట్‌చేసి, పాఠకులతో నాకు పరిచయ భాగ్యం కలుగజేసిన ఎడిటర్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

అడ్రస్:
జి.పి.రామ్‌చంద్
ఇ.నెం.63/4
చితంబరరావు వీధి.
కర్నూలు - 518 001.